## కొత్తభల్లుగుడ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి-అరకు లోయ :**అరకువ్యాలీ మండలం లోని కొత్త భల్లుగూడ గ్రామములో ఈ ఏడాది జనవరి 15న ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమాన్ని భారత ప్రధాన మంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించిన తర్వాత సదరు గ్రామం సమగ్ర అభివృద్ధిపై ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గ్రామములో ప్రతీ కుటుంబానికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత పథకాల లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపట్టారు. గ్రామములో మౌలిక వసతులు అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టారు. ఇటీవల గ్రామములో పర్యటించినప్పుడు గ్రామంలో వీధి దీపాలు వెలగక పోవడాన్ని గమనించిన ప్రోజెక్ట్ అధికారి యుద్ధప్రాతిపదికన వీధి దీపాలు పునరుద్ధరణ చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఏర్పాటు చేసిన విద్యుత్ లైటు

# కాఫీ, మిరియాల దిగుబడులకు ప్రణాళిక

### గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో గిరిజన రైతులు పెద్ద ఎత్తున సాగు చేస్తున్న కాఫీ, మిరియాల దిగుబడులు పెంచడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె..కన్నబాబు తెలిపారు. శనివారం మోదపల్లి గ్రామ వద్ద కాఫీ తోటలను పరిశీలించారు. కాఫీ రైతు కొర్ర వెంకటరావుతో మాట్లాడి కాఫీ, మిరియాలు సాగు పై ఏడాదికి వస్తున్న ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్గానిక్ పద్ధతులతో సాగు చేస్తున్న అరుకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి లభించిందని చెప్పారు. కాఫీ రైతులు బేబీ పల్పర్లు, ట్రసర్లు, టార్పాలిన్లు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కాఫీ రైతులకు అవసరమైన తోడ్పాటును అందించి తద్వారా కాఫీ దిగుబడి నాణ్యత పెంపొందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం కందమామిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని సందర్శించారు. చర్మవ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు సబ్బులు, మందులు పంపిణీ చేశారు. 9వ తరగతి క్లాస్ రూమ్‌లో సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మరుగుదొడ్లను వంటగదిని పరిశీలించారు. అనంతరం పాడేరు వి.డి.వి. కె. కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్ ప్రభాకర్, పీహెచ్ఓ ఎన్.అశోక్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డివిఆర్ఎం రాజు, డిఆర్డిఏ పిడి మురళి, ఏఈ దుర్గాప్రసాద్, కాఫీ బోర్డు డిడి ఎస్.రమేష్, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి ఎల్.రజిని, కాఫీ ఏఈఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.



కాఫీ రైతులతో మాట్లాడుతున్న కన్నబాబు



మాట్లాడుతున్న గంగరాజు

### ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలి

**-జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్**

**ప్రజాశక్తి అనంతగిరి:**ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్యం అందించే హెల్త్ అసిస్టెంట్ లేక విద్యార్థినీ విద్యార్థులు మృత్యువాతకు గురవుతున్నారని స్థానిక సిపిఎం జెడ్పిటిసి గంగరాజు అన్నారు. మండలంలోని టోకురు బాలికల పాఠశాలలో అనారోగ్యంతో ఏడవ తరగతి చదువుతున్న అప్పలకొండ విద్యార్థిని మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై జడ్పిటిసి ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి జమల్ భాష శనివారం పాఠశాలలో సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థినిలకు ఆరోగ్య సమస్యల పట్ల వైద్య పరీక్షలు నిర్వహించడం కాకుండా ఆరోగ్య సూత్రాలను వివరించారు. గంగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, హెల్త్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, పాఠశాల హెచ్ఎం స్వరూప రాణి పాల్గొన్నారు.

### భగత్ సింగ్‌కు ఘన నివాళి

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కార్తీక్ శ్రీను, పి.జీవన్ కృష్ణ మాట్లాడుతూ, దేశంలో సోషలిస్టు వ్యవస్థ ద్వారానే ప్రజలు సమాన హక్కులను పొందుతారని గాఢంగా విశ్వసించిన పోరాటయోధుడు భగత్ సింగ్ అన్నారు. పిన్న వయసులోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నా రన్నారు. భగత్ సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయం కోసం పాటుపడాలని అన్నారు. విద్యార్థులు తమ సమస్యలు పరిష్కారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం రద్దుకు, ధరల కనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంపు, అధ్యాపకుల నియామకంపై , పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**- పెండింగ్ వేతనాలు చెల్లించాలి**

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్**



వాలంటీర్ల సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

**ప్రజాశక్తి -ఎటపాక**

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ/ వార్డు వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకొని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఏపీ గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ నాయకులు బి.కుమార్ అధ్యక్షతన ఎటపాకలో శనివారం జరిగిన సదస్సులో వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నియమించిన వాలంటీర్లను టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం వాలంటీర్లకు రూ.10వేలు వేతనం అమలు చేసి, అధికారంలోకి వచ్చిన నాటి నుండి నాలుగు నెలలకు సంబంధించి పెండింగ్ వేతనం రూ.10వేలు చొప్పున రూ.40వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం సదస్సుకు హాజరైన వాలంటీర్లు ఎపి గ్రామ /వార్డు వాలంటీర్స్ యూనియన్ ఎటపాక మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్ష కార్యదర్శులుగా కొండబాబు, కుమార్, 9 మందితో కార్యదర్శి వర్గం, 28 మందితో మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పొడియం జానీ, పియన్‌యం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ, సిఐటియు మండల కమిటీ సభ్యులు తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలలో మెజిస్ట్రేట్ ఆకస్మిక తనిఖీ

**మౌలిక సదుపాయాల పట్ల అసంతృప్తి**

**ప్రజాశక్తి-రంపచోడవరం**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాజమండ్రి 7వ మెజిస్ట్రేట్, రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.బాబు శుక్రవారం స్థానిక గురుకుల బాలికల కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న ఆహార పదార్థాలను, బోధన తీరును, మౌలిక సదుపాయాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం కొరకు ఎక్కువ మొత్తంలో నిధులు ఖర్చు పెడుతున్నా ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగా లేవని, తక్షణమే విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. రోగాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాలకు తనవంతు సహాయంగా హాస్టల్ వసతి గదులు, ప్రాంగణంలో అవసరమైన లైట్లను అందజేస్తామని తెలిపారు.



పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీస్తున్న మేజిస్ట్రేట్ బాబు

# పెసా కమిటీల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

### నేషనల్ కాన్ఫరెన్స్‌లో డీడీని కోరిన జిల్లా సర్పంచులు

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా లో పెసా కమిటీల ఎన్నికలు సత్వరమే నిర్వహించాలని, జిల్లా లోని పలువురు సర్పంచులు కేంద్ర పంచాయతీరాజ్ శాఖకు విజ్ఞప్తి చేశారు. పెసా చట్టం అమలుపై అవగాహనకు డిల్లీ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జాతీయ సదస్సుకు అల్లూరి జిల్లా నుంచి పలువురు సర్పంచులు హాజరయ్యారు. వీరిలో పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్ట గుల్లి ఉషారాణి. ధారేల సర్పంచ్ పాండు రంగ స్వామి, బాకూరు సర్పంచ్ వెంకట రమణ రాజు, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు , చింతపల్లి ఎంపిపి కోరభు అనుష దేవి, చింతపల్లి సర్పంచ్ లలిత, తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు ముగిసిన అనంతరం శనివారం వారు స్థానిక విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ, 1996లో కేంద్ర ప్రభుత్వం చేసిన పీసా చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1998 నుంచి అమలు చేస్తోందన్నారు. 2013 సంవత్సరంలో పీసా గ్రామాలు ఏవి అనేది ప్రకటన చేశారని, అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లాలో 2014 సంవత్సరం లో పీసా ఎన్నికలు జరిగాయని, 5 సంవత్సరాల కాల పరిమితి ముగిసిందన్నారు. అనంతరం మళ్లీ ఎన్నికలు జరపలేదన్నారు. పెసా కమిటీలను పునరుద్ధరించాలని వారు పంచాయితీ రాజ్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ చైతన్యకు కోరారు. అల్లూరి జిల్లాలోని మైనింగ్ ఉన్న గ్రామాల్లో పూర్తి స్థాయి లో పెసా చట్టం అమలు కాని పరిస్థితి ఉందని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించి కార్యకలాపాలు సాగిస్తున్నారని వారు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.




హాజరైన సర్పంచులు



మాట్లాడుతున్న ఎంపిపి, జెడ్‌పిటిసి


### ప్రజలకు సేవలు అందించడం సంతృప్తికరం

**- ఎంపిపి అనూష దేవి, జెడ్‌పిటిసి బాలయ్య**

**ప్రజాశక్తి - చింతపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచి మూడేళ్లు పూర్తి అయ్యిందని, ప్రజలకు సేవలు అందించడం సంతృప్తికరంగా ఉందని, మిగిలిన రెండేళ్ల పదవీకాలంలోనూ అన్ని విధాల అభివృద్ధి, సంక్షేమాలు చేరువ చేసేందుకు కృషి చేస్తామని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. ఎంపిటీసీలుగా గెలిచి మూడేళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఎంపీపీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన ఎంపీటీసీలతో కలసి ఆమె కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ,ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గడచిన మూడేళ్లు సుపరిపాలన అందించామన్నారు. అనునిత్యం ప్రజా సమస్యలపై ఆలోచన చేయడమే గాక ఈ ప్రాంత అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లతోపాటు ఉన్నతాధికారులతో సమీక్షించి మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు సాధ్యం కానీ హామీలను గుప్పించి అధికారంలోకి రావడమే గాక వంద రోజులు పూర్తి అయినప్పటికీ ఇచ్చిన హామీలను విస్మరించి నేడు మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

### టిడిపి గూటికి వైసిపి నేతలు

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి జిల్లాలోని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం తెదేపా ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శనివారం పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన జడ్పిటిసి, ఎంపీపీ, పలువురు ఎంపీటీసీలు సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు వైఎస్ఆర్ సీపీకి చెందిన పాడేరు మండల జెడ్పిటిసి కిముడు గాయిత్రి దేవి, ఎంపీపీ సోనాయి రత్నకుమారి, మాజీ ఎంపీపీ రవణమూర్తి, యువ నాయకులు కిముడు విశ్వ, జి మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, మండలాలకు ఎంపీటీసీలు శనివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో తెదేపా ఇంచార్జి అయినటువంటి గిడ్డి ఈశ్వరితో కలిసి పని చేయాలని, మీ ప్రాంత అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పల్లా

# వరద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

**వైసిపి ఎమ్మెల్సీ రవిబాబు**

**ప్రజాశక్తి -సీలేరు**

జీకే వీధి మండలంలో ఇటీవల భారీ వర్షాలు, వరదలు వల్ల 8 గ్రామాల్లో అపార నష్టం సంభవించిందని, ప్రభుత్వం తక్షణమే వరద బాధ్యత కుటుంబాలకు ఆదుకోవాలని వైసిపి కుంభ రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీకే.వీధి మండలం గుమ్మరేవులు, దారకొండ పంచాయతీల పరిధిలోని మాదిగమల్లు, తోకరాయి, నిమ్మచెట్టు, కమ్మరితోట తదితర గ్రామాల్లో అరకు ఎంపీ గుమ్మ తనుజారాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి, వరదలకు కొట్టుకుపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ వరద బీభత్సానికి సర్వం కోల్పోయిన, తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు తక్షణ చర్యలు కింద ఆర్థిక సహాయం అందించిన అనంతరం పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరదలు వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద పనులు కల్పించి ఆ ఇసుక మేటలను తొలగించి, పంట పొలాలుగా తీర్చిదిద్దాలని కోరారు. వరదల్లో పూర్తిగా గృహాలు కోల్పోయిన బాధితులకు సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కా గృహాలు నిర్మించాలన్నారు. జీకే వీధి -సీలేరు మధ్యగల ప్రధాన రహదారి వరదలకు కొట్టుకుపోయి ఆస్తవ్యస్తంగా తయారై రవాణా సౌకర్యానికి అంతరాయం ఏర్పడిందని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి పూర్తి చేయాలని కోరారు. మాదిగమల్లు రహదారి, వంతెన పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ చట్రాపల్లి జరిగిన సంఘటన తీవ్రంగా కలచివేసిందని, గ్రామాన్ని సందర్శించడానికి రెండు సార్లు ప్రయత్నించినా పోలీసులు వెళ్లకుండా ఆంక్షలు విధించారని విచారం వ్యక్తం చేశారు. వరదల్లో ఇల్లు కోల్పోయి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. అనంతరం మాదిగమల్లు, నిమ్మచెట్టు గ్రామాల్లో ఇల్లు కోల్పోయిన బాధితులకు తాత్కాలిక టెంట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింతపల్లి, జీకే.వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, జడ్పిటిసిలు పోతురాజు బలరాము, శివరత్నం, గుమ్మరేవుల, దారకొండ సర్పంచ్‌లు మురళి కమలమ్మ, ఎన్.రాజు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాదిగమల్లో వరద బాధితుల తాత్కాలిక నివాసాలకు టెంట్లు, నిత్యవసరకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

### వంతెన నిర్మాణానికి చర్యలు

**ప్రజాశక్తి -కొయ్యూరు**

కొయ్యూరు మండలం శరభన్నపాలెం, కంపరేగుల గ్రామాల మధ్యలో ఉన్న కొండవాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఈమేరకు శనివారం విశాఖ నుంచి వచ్చిన సర్వే బృందం సభ్యులు స్థానికులతో కలిసి కొండవాగు దగ్గర కొలతలు తీసుకున్నారు. రెండు మూడు నెలల్లో వంతెన పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఇక్కడ వంతెన లేని కారణంగా వాగు పొంగినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్న విషయం తెలిసిందే.

### నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజాశక్తి-కొయ్యూరు :** మండలంలోని అంతాడ పంచాయితీ, బంగారమ్మపేట-1 సచివాలయం పంచాయితీ సెక్రెటరీ కె.ప్రసాద్ జన్మదిన వేడుకల్లో భాగంగా పేదలకు నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. అంతాడ, బంగారంపేట పంచాయతీల పరిధిలోని గ్రామాల నుండి ప్రతి గ్రామానికి ఇద్దరు లేక ముగ్గురు వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలను, ఆర్థికంగా వెనకబడి కుటుంబాలు వారిని 50 మందిని ఎంపిక చేసి వారికి ఈ నిత్యవసర సరుకులను పిఎస్‌పికె ట్రస్ట్ బ్యాగులతో ప్యాక్ చేసి అందజేశారు.

# కెజిబివిబిలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి- చింతూరు**

మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఉదయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రంపేట కస్తూరిబాయి బాలికల విద్యాలయంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఎనీమియా రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు టెస్టులు చేశారు. జ్వరం తీవ్రత ఉన్న విద్యార్థులను చింతూరు ఏరియా హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కంటికి సంబంధించిన ఆప్తాల్మిక్ కిషోర్ ఐ స్క్రీనింగ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని, ఎలర్జీ ఉన్నవారు ఒకరి దుస్తులు మరొకరు వేసుకోకూడదని, ఎవరు దుప్పటి, టవళ్లు, సబ్బులు వారే వాడుకోవాలని సూచించారు. గొంతు నొప్పి వాపు ఉంటే వేడి చేసిన నీళ్లలో ఉప్పు కలుపుకొని పుక్కిలించి ఊయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ సిహెచ్.వెంకటేశ్వరరావు, హెచ్‌వి పి.సరోజినీ, గంగరాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

## సీతారాం ఏచూరికి ఘన నివాళి

**ప్రజాశక్తి-పాడేరు:** మండలంలోని వనుగుపల్లి పంచాయితీ చింతగున్నాలు గ్రామంలో శనివారం నిర్వహించిన సిపిఎం మహా సభలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సుందరరావు, నాయకులు లక్కు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం ఒక గొప్ప నాయకుని కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఏచూరి గొప్ప మేదావి, రచయిత అని కొనియాడారు. తియ్యగెడ్డ, మతికబండా నుండి ఓరంకూర గ్రామాల్లో రోడ్లు వేయాలని తీర్మానించారు. అనంతరం శాఖా కార్యదర్శిగా కొర్ర. ప్రసాద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పన్న, రమేష్, జోగులు, భాస్కరరావు పాల్గొన్నారు.

## 30న ధర్నాను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి-హుకుంపేట:** కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేస్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నేతలు కోరారు. ఈ మేరకు శనివారం హుకుంపేటలో కరపత్రాలను సిఐటియు మండల నాయకులు విడుదల చేశారు. జిల్లాలో ఐటిడిఏ, గిరిజన కార్పొరేషన్, మెడికల్ అండ్ హెల్త్, విద్యాశాఖ, ఎన్ ఆర్ జి ఎస్, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులాలు, విద్యుత్, ఆర్టీసీ, ఏపీ టూరిజం, కాఫీ బోర్డు తదితర కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం 26000 చెల్లించి, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

**ప్రజాశక్తి -నక్కపల్లి:** వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ఇప్పటికీ 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ప్యాకేజీ చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, చందనాడ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, నిర్వాసితులు డిమాండ్ చేశారు. శనివారం తహసిల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని చందనాడ రెవెన్యూలో ప్రభుత్వం ఏపీఐఐసి ద్వారా వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు చందనాడ, తమ్మయ్యపేట, తుమ్మలపేట గ్రామాల్లో జిరాయితి, డి.ఫారం, సాగు భూములతో పాటు నివసిస్తున్న ఇల్లులను సేకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం 2010, సెప్టెంబర్ 15 కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుని నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే ఆర్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని గ్రామ సచివాలయం వద్ద నోటీస్ బోర్డు నందు లబ్ధిదారుల జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. 2010 సంవత్సరానికి సంబంధించి కటాఫ్ తేదీని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామన్నారు. నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు, చెట్లకు, నిర్మాణాలకు, ఇళ్లకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి పునరావాసం, పునర్నిర్మాణం పూర్తిచేసిన పిదప ప్రభుత్వం భూములను ఎప్పుడైతే స్వాధీన చేసుకుంటారో దానినే కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఇల్లు కోల్పోయిన వారికి 25 లక్షలు, ప్రాజెక్ట్ ఎఫెక్ట్ కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి 15 లక్షల ప్యాకేజీ చెల్లించి నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రోకళ్ళ గోవిందు, పుణ్యమంతుల బాబ్జి, పి.అప్పలరాజు, జీ.సురేష్, వై.శ్రీను, ప్రసాద్, మహేష్ బాబు తదితరులు ఉన్నారు.

## చెత్త రహిత గ్రామాలే లక్ష్యం

**ప్రజాశక్తి -నక్కపల్లి:** చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. మండలంలోని ఉద్దండపురంలో శనివారం చెత్త సంపద తయారీ కేంద్రంలో స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా వర్మీ కంపోస్టు తయారీకి సర్పంచ్ వెంకటేశ్వరరావుతో కలిసి వానపాములను విడుదల చేశారు. గ్రామాల్లో తడి ,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించి సంపదను సృష్టించుకోవాలన్నారు. పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

**కొత్తకోట:** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కొత్తకోట వాసవి క్లబ్ న్యూ ప్రతినిధులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా శనివారం కొత్తకోట పియస్ఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాసవి క్లబ్ సభ్యులు వివిధ రకాల మొక్కలకు సంబందించిన సీడ్ బాల్స్ విత్తనాలు పంపిణీ చేసారు.

## మైదానంలో మంచు దుప్పటి

**ప్రజాశక్తి -కోటవురట్ల:** తొందరపడి ఒక కోయిల ముందే కూసింది, అని సినీ గేయ రచయిత రాసినట్లు వర్షాకాలం ముగియకముందే చలికాలం స్వాగతం పలికి మంచు సోయగంతో శనివారం దర్శనమిచ్చింది. దీంతో పకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుతం కురుస్తున్న మంచు కారణంగా మరికొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

# పలుచోట్ల 'మన ఇల్లు - మన గౌరవం'


అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**డుంబ్రిగుడ:** ఖంద్రుమ్ పంచాయతీ పంచాయతీలో స్థానిక సర్పంచ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో శనివారం మన ఇల్లు మన గౌరవ కార్యక్రమం నిర్వహించారు. ఆ పంచాయతీలో 134 మంది గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు పంచాయతీ గ్రామ సభలో గృహ నిర్మాణ పథకం పై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవంలో భాగంగా గర్భిణిలకు, బాలింతలకు అవగాహన కల్పించారు..ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, మాజీ సర్పంచ్ కిలో ఆనంద్, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, అంగన్వాడీ సూపర్వైజర్, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

**సీలేరు:** జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీలో మన ఇల్లు -మన గౌరవం గ్రామసభ శనివారం నిర్వహించారు. కార్యక్రమం ప్రధాన అంశాలను పంచాయతీ కార్యదర్శి అరుణ గ్రామసభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం పెట్టడం శుభ పరిణామన్నారు. 2016 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు, 2019 నుండి 2024 వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గ్రామసభ ద్వారా లబ్ధిదారులకు అల్టిమేట్ జారీ చేసిందని పేర్కొన్నారు. అయితే గత పది సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు లబ్ధిదారులకు సకాలంలో బిల్లును చెల్లించకపోవడం, కేటాయించిన డబ్బులు సరిపోకపోవడం వలనే నేటికీ లబ్ధిదారులు నిర్మించుకోలేని స్థితి నెలకొందని పేర్కొన్నారు. కొంతమంది అప్పులు చేసి ఇల్లు కట్టి నేటికీ అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షా 80వేలు ఇంటి నిర్మాణానికి ఏ మాత్రం సరిపోవడం లేదని, మరో రూ.2 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గాలికొండ మాజీ సర్పంచి చంద్రరావు, టిడిపి కుటమి నాయకులు పంద్ర చిన్న, కించె భీమన్న, ఎ.దారకొండ కార్యదర్శి రాధా తదితరులు పాల్గొన్నారు.

**సీలేరులో..**

జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో సర్పంచ్ దుర్జో అధ్యక్షతన మన ఇల్లు -మన గౌరవం గ్రామసభ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్ ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఉప సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, ఎన్ఆర్జిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నబ్బాయి, సచివాలయ సిబ్బంది కుసుమ, కుమారి, అనుష్క, రేవతి, కూటమి నాయకులు చిటికల రాము, వనముల రాము, బాలు, కే.అప్పలరాజు పాల్గొన్నారు.

**అనంతగిరి:** అనంతగిరి పంచాయతీలో జరిగిన మన ఇల్లు మన గౌరవంలో జెడ్‌పిటిసి గంగరాజు పాల్గొన్నారు. ఇందిరమ్మ, ఇతర గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కిల్లో. మొస్య, సోమ్మెల రూతులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో వైసిపి నేతల పూజలు

**ప్రజాశక్తి- అరకులోయ రూరల్:** రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన తిరుపతి లడ్డు ప్రసాదంపై చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అనంతగిరి రూరల్:** కాశీపట్నం గుడిలో వైసిపి నాయకుడు రెగబోయిన స్వామి ఆధ్వర్యాన పూజలు నిర్వహించారు.

**రంపచోడవరం :** మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపుమేరకు శనివారం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ఆధ్వర్యాన రంపచోడవరం మండలం, ఐ.పోలవరం కొండ మీద ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామిగుడికి కింద నుంచి కాలినడకన చేరుకుని పూజలు నిర్వహించారు. తిరుపతి లడ్డూ ప్రతిష్టను దిగజార్చిన అధికార పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**కొయ్యూరు :** రాజకీయ లబ్ధి కోసం తిరుపతి లడ్డూపై తప్పుడు ప్రచారం చేయడం తగదని కొయ్యూరు వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, వైసీపీ సీనియర్ నేత గాడి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం గోపవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** స్థానిక మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో శనివారం కమీషనర్ సురేంద్రకు వినతి పత్రం అందించారు. ఎపి మున్సిపల్ ఎంప్లాయిష్, వర్కర్స్ పెడరేషన్ (సిఐటియు ) అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, మున్సిపాలిటీలో చెత్త సేకరణలో భాగంగా పుష్‌కార్టులు, చీపుర్లు, తట్టలు, గ్లౌజులు వంటి వాటిని కార్మికులకు ఇవ్వాలన్నారు. సుమారు 60 వేలు జనాభా తగినట్లుగా కార్మికుల సంఖ్య పెంచి పని బారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సబ్బులు,నూనెలు ఇవ్వాలని, 2024 జనవరిలో ప్రభుత్వం ఇచ్చిన 1000రూపాయల పొంగల్ అలవెన్సును చెల్లించాలని కోరారు. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కమీషనర్ స్పందించి సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కెవీపిఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ యూనియన్ నాయుకులు వాసుపల్లి రమణ,చంటీ పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

## లారీ ఢీకొని యువకుడు మృతి

**ప్రజాశక్తి -కశింకోట :** మండలంలోని ఎన్జీ పాలెం పాల కేంద్రం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కసింకోట ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... ఎలమంచిలి మండలం సైకిల్‌పాలెం గ్రామానికి చెందిన పెంటకోట సాయి (23) ద్విచక్ర వాహనంపై తాళ్లపాలెం నుండి ఎలమంచిలి వైపు వెళుతుండగా, ఎన్జీపాలెం వద్ద వెనుక నుండి లారీ ఢీకొట్టింది. దీంతో సాయి అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడు సాయికి తండ్రి మాణిక్యం, తల్లి పార్వతి, ఒక సోదరి ఉన్నారు. సాయి మృతదేహాన్ని కసింకోట పోలీసులు ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుడు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

**ప్రజాశక్తి -ఆనందపురం :** మండలంలో రెండు వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శొంఠ్యాం సమీపంలో శనివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని యాత కనమాం గ్రామానికి చెందిన కోరాడ సురేష్ (24), గోరింట గ్రామానికి ఎర్నిబాబు (26) ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సురేష్‌కు కాలు విరిగింది. ఎర్నిబాబుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం విశాఖపట్నం క్యూ1 హాస్పిటల్, పినాకిల్ హాస్పిటల్‌కు తరలించారు.

ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ ఆర్‌టిఒ కార్యాలయం ఎదురుగా టైల్స్‌షాప్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని బైకు ఢీకొట్టింది. టైల్స్ షాప్‌లో పనిచేస్తున్న మద్దిలపాలెం చైతన్యనగరకు చెందిన బుస కృష్ణ (38) నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణతోపాటు బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనందపురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి స్మగ్లర్ అరెస్టు

**ప్రజాశక్తి -నక్కపల్లి:** గంజాయి స్మగ్లర్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. రోలుగుంట మండలం బీబీ పట్నం గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ ఆది రాజులనాయుడు 2023లో గంజాయి అక్రమ రవాణా కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి స్మగ్లర్ ఆది రాజుల నాయుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. శనివారం స్మగ్లర్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని తెలిపారు.

## రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత : ఇద్దరు అరెస్టు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనంజయనాయుడు ఆధ్వర్యాన ఆర్‌పిఎఫ్/ఎల్ఎస్ఐ పిఆర్.బిశోయి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై తనిఖీలు చేపట్టారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం, భిండ్ జిల్లాకు చెందిన అమన్ సఖ్య, రాధే శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ఆర్‌పిఎఫ్ సిబ్బంది శాంతారామ్‌కు అప్పగించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపారు. విశాఖపట్నం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు సూచనలు మేరకు విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం రైల్వే స్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

## వసతి గృహాలను తనిఖీ చేసిన సివిల్ జడ్జి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్**

మండలంలో బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, జీ టి డబ్ల్యూ వసతి గృహాలను మండల లీగల్ కమిటీ సర్వీసెస్ చైర్మన్, సివిల్ జడ్జి శ్యామ్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వసతి గృహాల్లో రికార్డులను పరిశీలించారు. మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ ఆధారిటీ ఆదేశాల మేరకు వసతి గృహాలలో విద్యార్థులకు సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించామని శ్యామ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, ఎంఈఓ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ వినోద్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు

## ఎస్ఐగా వినోద్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-అడ్డతీగల :** అడ్డతీగల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.వినోద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత పెడదారి పట్టకుండా సన్మార్గంలో నడవాలని కోరారు. అలాగే టిడిపి కూటమి నాయకులు నూతన ఎస్ఐ వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐను కలిసిన వారిలో బుర్లె హరిబాబు, అక్కపల్లి పండు, ఎడ్ల శ్రీనివాస్, భారతి, బాలయోగి, సాగర్, కుప్పాల జయరాం, పొడుగు సాయి ఉన్నారు.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

**ప్రజాశక్తి -ఎటపాక, చింతూరు :** మావోయిస్టు వారోత్సవాలకు వ్యతిరేకంగా ఎటపాక మండలం బండిరేవు, లక్ష్మీపురం, బాసవాగు, నందిగామ, మురుమూరు, చింతూరు మండలం చింతూరు, ఏడుగురాళ్ళపల్లి, కాటుకపల్లి తదితర గ్రామ పరిసర ప్రాంతాలలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. 'గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టు వారోత్సవాలు వద్దు', ఎవరి కోసం ఈ మావోయిస్టు వారోత్సవాలు? అంటూ గిరిజన అభ్యుదయ సంఘం, అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేర్లతో ఈ పోస్టర్లను అంటించారు.



మోహిత్‌తో పాఠశాల ఉపాధ్యాయ బృందం

## జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-కొయ్యూరు :** కొయ్యూరు గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె.మోహిత్ జిల్లాస్థాయి సెటిల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ టీవీఎం మోహన్ తెలిపారు. ఈనెల 27న జరిగిన పాడేరు నియోజకవర్గం స్థాయి సెటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా, మోహిత్ ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రిన్సిపల్ మోహన్, పిడికె శివాజీ, పిఈటి ఎల్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

## కొనసాగుతున్న టేబుల్ టెన్నిస్ పోటీలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం గీతం యూనివర్సిటీ వేదికగా ప్రారంభమైన ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు రెండో రోజైన శనివారమూ విజయవంతంగా కొనసాగాయి. అతిథులుగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్ దాస్, డాక్టర్ సార్వభౌమ, కె.శ్రీకృష్ణమూర్తి పాల్గొన్నారు.

# 'ఉక్కు' పరిరక్షణకు ఉద్యమించండి

**విద్యార్థుల పోరాటాలతోనే నాడు స్టీల్‌ప్లాంట్ నిర్మాణం**

**విద్యార్థి మేధో మథనం సదస్సులో వక్తలు**



సదస్సులో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై బాల మోహన్‌దాస్, కొల్లా రాజమోహన్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో 1966లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం జరిగిన పోరాటాల్లో ఆంధ్రా యూనివర్సిటీ, ఎవిఎన్ కాలేజీ విద్యార్థులే కీలకపాత్ర పోషించారని, నేడు స్టీల్‌ప్లాంట్‌ను ఎవడికో అమ్మేస్తాం, మూసేస్తాం అంటే విద్యార్థులు, యువకులు చూస్తూ ఊరుకోకూడదని, దాని పరిరక్షణకు ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎయు టిఎల్ఎన్ సభా హాల్‌లో సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యాన విద్యార్థుల మేధో మథనం సదస్సు శనివారం జరిగింది. విశాఖ ఉక్కును పభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని 1325 రోజులుగా విశాఖలో ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఈ సదస్సును ఆంధ్రా యూనివర్సిటీ టిఎల్ఎన్ సభా హాల్‌లో ఏర్పాటు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, నాడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని విశాఖ ఉక్కు - మన హక్కు నినాదంగా మార్చాలని కోరారు. ప్రయివేటు వ్యక్తులు బజ్జీలు, పకోడీలు, పండ్లు, నిత్యావసర సరుకుల దుకాణాలైన సూపర్ మార్కెట్‌లు నడిపినంత సులువుగా స్టీల్‌ప్లాంట్‌ను నడపడం సాధ్యం కాదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ భూముల కోసమే ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను వేదాంత కంపెనీకి నాడు బిజెపి, టిడిపి ప్రభుత్వాలే కట్టబెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ పరిశ్రమను నాడు మూసివేసి అందులో పనిచేసిన పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులందరినీ రోడ్డున పడేసి, నేడు ఆ భూములు అమ్ముకుంటున్నారని తెలిపారు. లక్ష మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్ గాజువాకకే పరిమితం కాదని, ఆంధ్ర రాష్ట్రానికే ఏకైక భారీ పరిశ్రమ అని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చేపట్టిన ఉద్యమాన్ని, 32 మంది ప్రాణాల త్యాగాన్ని, మత్స్యకారులు, రైతులు తమ భూములను ప్లాంట్ కోసం ఇచ్చిన వైనాన్ని విద్యార్థులకు వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటేనే ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోగలుగుతామని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. నేడు భారతదేశంలో నిరుద్యోగం అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు ప్రైవేట్ చేతుల్లోకి వెళితే మరింత నిరుద్యోగం పెరిగి భవిష్యత్ అగమ్యగోచరంగా తయారవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రలను తెలియజేశారు. ఉక్కు రక్షణ కోసం ఆంధ్రా యూనివర్శిటీలోనే ఉద్యమానికి పునాది వేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉక్కు రక్షణకు ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం పూర్వ నాయకులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, తదితరులు పాల్గొన్నారు.

# అదరహో.. వైశాఖి నృత్యోత్సవ్

**ఆకట్టుకున్న ఒడిస్సీ, జుగల్బందీ, కూచిపూడి, కథక్ ప్రదర్శనలు**

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండిఎ) వ్యవస్థాపక అధ్యక్షులు బిఆర్.విక్రమ్ కుమార్ (గౌడ్) ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న 'వైశాఖి నృత్యోత్సవ్' రెండో రోజైన శనివారం అదరహో అనేలా సాగింది. నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. రెండో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిఎస్‌పి విశాఖ కమాండెంట్ కెవి.మురళీకృష్ణ, గౌరవ అతిథిగా సిఆర్‌పిఎఫ్ రెండో కమాండెంట్ పి.కిషోర్, ప్రియ అతిథులుగా సూదగాని రవిశంకర్ నారాయణ్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి హాజరయ్యారు. శనివారం ప్రదర్శనలో భాగంగా ఒడిశాకు చెందిన ప్రముఖ ఒడిస్సీ నాట్య నిపుణురాలు, 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత ఇలియానా సితారిస్టి తన బృందంతో కలసి కనువిందైన ఒడిస్సీ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం పశ్చిమ బెంగాల్‌కు చెందిన పరణిత, ఇంద్రనీల్ బృందాలు చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గతానారాయణ్ చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శన అలరించింది. జర్మనీకి చెందిన గురు దుర్గా ఆర్య బృందం కథక్ నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈ ప్రతిష్టాత్మక నృత్యోత్సవాల సందర్భంగా ప్రదర్శనానంతరం ఆయా కళాకారుల స్థాయికి తగ్గట్టు అవార్డుల ప్రదానం చేశారు. అందులో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఇలియానా సితారిస్టికి డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు-2024ను, కథక్ నృత్యకారిణి గురు దుర్గా ఆర్య (జర్మనీ)కు కథక్ వైశాఖీ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. కూచిపూడి నర్తకి గీతానారాయణ్‌ను వైశాఖీశ్వర ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించారు.


రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ఉన్న తుప్పలు

## రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించరూ..

**ప్రజాశక్తి-దేవీపట్నం :** మండలంలోని గోకవరం నుండి పోతవరం వెళ్లే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఈ రహదారిలో ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పజుల్లాబాద్ గ్రామం చివర ఉన్న మలుపులో ఓ రావి చెట్టు ఉండడంతో ఇటు నుంచి వెళ్లే వాహనదారులకు అట నుంచి వచ్చే వారు కనిపించకపోవడంతో తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం ఆర్ అండ్ బి అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కనీసం రెండు వైపులా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి మలుపులు వాహనదారులకు క్లియర్‌గా కనిపించే విధంగా తుప్పలు తొలగించాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

## చిట్టెంపాడులో గ్రామసభ

**ప్రజాశక్తి - కొయ్యూరు :** డిపిఒ ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం చిట్టెంపాడు గ్రామసచివాలయం వద్ద శనివారం గ్రామసభ నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047, ఇది మంచి ప్రభుత్వం, స్వచ్ఛత హి సేవ తదితర కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో చిట్టెంపాడు సర్పంచ్ నేమాని నూకలమ్మ, జెడ్పీటీసీ వారా నూకరాజు, ఉప సర్పంచ్ పాడి దారలక్ష్మి, టిడిపి కూటమి నాయకులు స్వామినాయుడు, సన్యాసిరావు, వెంకటేశ్వర్లు, నూకరాజు, వైసిపి నాయకులు గాంధీ, పండు, వార్డు మెంబర్లు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో తనిఖీలు

**ప్రజాశక్తి - కొయ్యూరు :** కొయ్యూరు మండలం, కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలను టాస్క్‌ఫోర్స్ అధికారి కె.సురేష్ శనివారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, మెనూ అమలుపై ప్రత్యేకంగా ఆరా తీశారు. కళాశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు, సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కొయ్యూరు :** స్వర్ణాంధ్ర-2047 పోస్టర్‌ను మండల కేంద్రంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, సర్పంచ్ మాకడ బాలరాజు, మేడిబోయిన చక్రరావు ఆధ్వర్యంలో శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శులు వజ్రపు వెంకటరమణ, ముట్టడం వీరయ్య దొర పాల్గొన్నారు.

## గుండె జబ్బులపై వాక్‌థాన్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని గుండె జబ్బులపై విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో శనివారం వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకు ఈ కార్యక్రమం జరిగింది. ప్రఖ్యాత కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లు డాక్టర్ డికె.బారుహ్, డాక్టర్ ఎన్‌కె.పాణిగ్రాహి, డాక్టర్ త్రివేది, డాక్టర్ విజయ్, డాక్టర్ శశాంక్, డాక్టర్ చక్రధర్, అపోలో సిఒఒ డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఇతర నిపుణులు, వైద్యులు, రెండు వేల మందికిపైగా కార్పొరేట్ ఉద్యోగులు, ఆరోగ్య స్పృహ కలిగిన వారు ఈ వాకథాన్‌లో నడిచారు. డాక్టర్ డికె.బారుహ్ మాట్లాడుతూ భారతదేశం యువతలో గుండెపోటు మరణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.